వలన వారు తిరిగి అప్పారావుసంస్థానమును నిలుపవలె నను రాజ విశ్వాసము కలవా రయి, పైనఁ జెప్పియున్న కోనప్పగారి సంతతి లో చేరిన రామన్నగారి కుమారు లగు వేంకటాద్రి అప్పారావు గారికి ఈ జమీ తాలూకాలను క్రమక్రమముగా ఇజారా కిచ్చునట్లు అప్పటి యుద్యోగస్థులతో మాటలాడి యేర్పాటుచేసి యిప్పించిరి. లింగయ్య అప్పారావు అనెడి వీరి జ్ఞాతి కూడ కొంత దేశము నాక్ర మించి వ్యవహరించినట్లును, కమదనవారివలన ఆయన పొడిచివేయఁ బడినట్లును జెప్పెదరు. ఇంతటిలో తృప్తిచెందక యీ కమదనసహో దరులు హైదరాబాదు పట్టణమున కేగి యీ పరగణాల కన్నిటికిని తిరిగి జమీఁదారీసనదును వేంకటాద్రి అప్పారావుగారి పేరఁ దీసి కొనివచ్చిరి. కాని వారు నూజవీటికి వచ్చుసరికే ప్రభువు పరలోకగతుఁ డయ్యె. ఐనను కుటుంబమందు అభిమానము వదలక వారి తమ్ము లగు జగన్నాథ అప్పారావుగారిని జమీందారుగా నేర్పాటుచేసిరి. కాని కొంతకాలమునకు వీరు కృతఘ్ను లయి కమదనవారిని దేశములో నుండి వెడలఁగొట్ట ప్రయత్నింపఁగా ఉభయకక్షులవారికిని ఘోర మగు యుద్ధము జరిగెను. దానిలో అప్పారావుగా రపజయము నొంది కమదనవారివలనఁ బట్టుకొనఁబడిరి. అట్టి స్థితిలో నిడుదవోలు పెంట పాడు పరగణాలు వారి కిచ్చునట్లు వాగ్దానము చేయించుకొని ప్రభు వును వదలివైచిరి. కాని స్వాతంత్ర్యము వచ్చినవెంటనే జగన్నాథ అప్పారావుగారు కమదనవారిని దేశమునుండి తఱిమివైచిరి. అందు మీఁద వారు తిరిగి హైదరాబాదునకుఁ బోయి నూజవీడు సంస్థాన మున కంతకును తమ పేరున సనదును బొంది నూజవీటికి వచ్చిరి. అందు మీఁద జగన్నాథ అప్పారావుగారు భీతిఁ జెంది సనదును రద్దుచేయిం చినయెడల బారామహాలు ఎప్పటికిని వారి కిచ్చివైచెద నని చెప్పిరి. మరల ప్రభువాక్యమున విశ్వాసము గలవా రయి హైదరాబాదునకు వెళ్లి వా రట్లు జరగించిరి. కాని వారు వచ్చినతరువాత వాగ్దా నానుసారముగ ప్రభువు వర్తింపఁడయ్యె. అప్పటికి ఫ్రెంచివారు ఈ సంస్థానములో చేరిన "దివి" గ్రామమునఁ గోట కట్టి వర్తకము చేయు చుండిరి. కావున కమదనవారు వారి సాహాయ్యమును గోరిరి. అందు మీఁద వారు అప్పారావువారితో యుద్ధము చేసి ఓడించి జగన్నాథ అప్పారావుగారిని ఖైదీగా తీసికొని పోయిరి. వీరు 1756-వ సంవత్స రములోఁ బ్రసిద్ధిగాంచిన ఫ్రెంచి సేనానాయకుఁ డగు "బుస్సీ" స్వాధీనములో నుండి గుల్బర్గా యను పట్టణమునొద్ద కాలధర్మము నొందిరి. కొంతకాలము ఫ్రెంచివారే సంస్థానమును పరిపాలించిరి. తరువాత కూడ కమదనవారు అప్పారావు కుటుంబమునందు విశ్వాస మును వదలఁజాలక యేలూరులో సంహరింపఁబడిన రామచంద్ర అప్పారావుగారి మునిమనుమఁ డగు వేంకటాద్రి అప్పారావుగా రనువారిని తీసికొనివచ్చి 1463-వ సంవత్సరమున వారికి పదునైదు పరగణాలకు హైదరాబాదు నవా బగు నైజా మల్లీఖానుచేత సనదు నిప్పించిరి. తుట్టతుద కీ అప్పారావుగారు కమదనవారియందు కృతజ్ఞ తను చూపి బారామహల్లు అనఁగా గుడివాడ చిన్నకోట కలిదిండి బత్తరుజల్లి తాలూకాలను ప్రత్యేకముగ వారికి జమీందారీగ ఇచ్చి వేసిరి. వారి వంశస్థు లిప్పటికిని గుడివాడలోను గుగజలోను అలవెన్సు జమీందార్లుగ నున్నారు.

ఈ వేంకటాద్రి అప్పారావుగారు తమ తమ్ము లగు నరసింహ అప్పారావుగారిని తమతో సమానముగ సంస్థానవ్యవహారము నిర్వ హించునట్లు చేసెను. వీ రుభయులును రాజ్యము చేయుచుండఁగ అనఁ గా 1766-వ సంవత్సరమున ఈ సంస్థానమం దొక భాగముగా నున్న కొండపల్లి సర్కారును ఈస్టు ఇండియా కంపెనీవారికి హైదరా బాదు నవాబుగా రొసఁగిరి. 1771-వ సంవత్సరములో వేంకటాద్రి అప్పారావుగారు కాలముచేసినందున నరసింహ అప్పారావు అను నారయ్యప్పారావు గారే ప్రభు వై పరిపాలించుచుండిరి. కాని నర సింహ అప్పారావుగారు జాగ్రత్తగా వ్యవహారము చేయనందున ఇం గ్లీషువారికి నవాబుగారి యేర్పాటు ప్రకారము సైన్యసాహాయ్యము నకు ప్రత్యామ్నాయముగ చెల్లించుటకు ఏర్పాటుచేసికొనియున్న పన్నును బాకీలో నుంచిరి. అందుమీఁద అనఁగా 1773-వ సంవత్సర ములో బందరునుండి యొక సేన యింగ్లీషువారిచే పంపఁబడెను. అప్పు డు బందరులోని కంపెనీ యుద్యోగస్థులయొద్ద జమీందారుగారు సొమ్ము అప్పుతీసికొని పన్నుబాకీ తీర్మానముచేసెను. అ ప్పిచ్చి యున్న "వైటుహిల్లు" "హడ్జను" అనువారలు జమీందారుగారిని మిక్కిలి చిక్కులుపెట్టినందున మదరాసు గవర్నమెంటువారికి తెలియఁబఱుచుకొనఁగా నప్పటి గవర్న రగు "లార్డు మెకార్డనీ" గారు కంపెనీయుద్యోగస్థుల నడతను నిందించుచు లండనునకు రికా ర్డును పంపెను. కాని యిది యంతయు నాలస్య మగుచుండుటచే అప్పారావుగారు అర్జీలవలన న్యాయము కలుగ దను నమ్మిక గలవారై 1783-వ సంవత్సరమున నూజవీడు కోటను ముట్టడికి సిద్ధపఱిచి యుద్ధమునకు సేన నాయత్తముచేసిరి. అప్పుడు "మేజరు టవున్సు" అను సేనాధిపతితో సేనను నూజవీటికి పంపిరి. కాని ఆయన అప్పా రావువారి సైన్యమును జయిపస్థైర్యము చాలనివాఁ డగుటచే మరి యొక సేనాధిపతిని తోడు పంపిరి. అప్పు డుభయసైన్యములును తార సిల్లఁగా ఘోరయుద్ధము జరగెను. అప్పారావు సంస్థానపు సేనాధి పతి యగు చెలికాని వెంకయ్యగారు రణరంగమందు మడిసిరి. ప్రభువు కోట దిడ్డిగుమ్మముగుండ తప్పించుకొని వెళ్లి భద్రాద్రి యడ వులకు చేరెను. అందుమీఁద నైజామునకు వ్రాసి యీ ప్రభువును స్వాధీనపఱుచుకొనుటకు కంపెనీవారు ప్రయత్నించుచుండఁగా వారే స్వయముగా రాజమహేంద్రవరములో నున్న "డానియల్" అను ఆఫీసరువద్దకు వచ్చి, తమ తిరుగుఁబాటును క్షమించి తిరిగి జమీందారీ ని స్వాధీనము చేసినయెడల బాకీపన్ను చెల్లించెద ననియును సర్కా రునకు విధేయుఁడనై యుండెద ననియు చెప్పినందున, ఆయన నమ్మి జమీని తిరిగి వీరికి స్వాధీనపఱిచెను. కాని బాకీ పూర్తిగా నియ్యక సర్కారువారి యుత్తరువులను తృణీకరించినందున "కాప్టెను మాన్ గోమరీ" అను సేనాధిపతిని సేనతో నూజవీడు కోటకు పంపిరి. అప్పు